ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

మంగళవారం | 14 జులై, 2026 | పేజీలు : 08


## ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ:** తమ సమస్యలను అధికారులు తప్పకుండా పరిష్కరిస్తారనే నమ్మకాన్ని ప్రజలకు ప్రతి శాఖ అధికారులు కలిగించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి కలెక్టర్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలకు సంబంధించిన వినతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత శాఖ అధికారులకు ఆయా వినతులను ఇచ్చి క్షేత్రస్థాయిలో విచారణ చేసి ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 335 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో భాస్కర్, గృహ నిర్మాణ శాఖ పీడీ మాతృ నాయక్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకుండా మోసం చేసింది

### మోరంచపల్లిలో కొత్త రేషన్ షాప్ ప్రారంభం

### పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందిస్తాం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లు పేదలకు ఒక్క రేషన్ కార్డు ఇయ్యక ప్రజలను మోసం చేసిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విమర్శించారు. సోమవారం భూపాలపల్లి మండలం మోరంచపల్లి గ్రామంలో నూతన రేషన్ షాప్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే *గండ్ర సత్యనారాయణ రావు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి రేషన్ షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం ఇస్తే ఖర్చు ఎక్కువ అవుతుందని సాకు చూపి లబ్ధిదారులను మోసం చేసిందని విమర్శించారు. నాణ్యత లేని దొడ్డు బియ్యాన్నే పంపిణీ చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ధనవంతుడు తినే సన్న బియ్యాన్ని పేద వాళ్లకు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజల ఆహార భద్రతే ప్రభుత్వ ధ్యేయమని, సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి అర్హుడికి చేరేలా చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఆర్డీవో హరి క్రిష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చాడ రఘునాథ్ రెడ్డి, స్థానిక సర్పంచ్ నరెడ్ల తిరుపతి రెడ్డి, రేషన్ షాప్ నిర్వాహకులు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు, మండల నాయకులు పాల్గొన్నారు.



### భరోసా కేంద్రాన్ని సందర్శించిన

## వరంగల్ పోలీస్ కమిషనర్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్:** వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ సోమవారం రంగంపేటలోని వరంగల్ భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి కేంద్రంలో అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా భరోసా కేంద్రంలో బాధితులకు అందిస్తున్న కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, మానసిక పరామర్శ, పునరావాస చర్యలు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్రానికి వచ్చే ప్రతి బాధితుడిని సానుభూతితో, గౌరవప్రదంగా స్వాగతించి, వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మహిళలు, చిన్నారులు మరియు ఇతర బాధితులకు ఒకే వేదికపై అన్ని సేవలు అందించే భరోసా కేంద్రం ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రతి కేసును నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించేలా సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. బాధితుల గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూడాలని అధికారులకు తెలిపారు.

ఈ సందర్శనలో క్రైమ్ అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీ సదయ్య, భరోసా కేంద్రం ఇన్స్పెక్టర్ సువర్ణ, మహిళా పోలీస్ స్టేషన్ 1 ఇన్స్పెక్టర్ సూర్య ప్రసాద్, భరోసా ఎస్.ఐ కిరణ్మయితో పాటు కౌన్సెలర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ‘సర్’ ప్రక్రియ వేగవంతంగా పూర్తి

### కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్–2026) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు.సోమవారం హనుమకొండలోని వికాస్‌నగర్, సమ్మయ్యనగర్ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, డిజిటలైజేషన్, పెండింగ్ వివరాలను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.మొబైల్ యాప్ ద్వారా బీఎల్ఓలు నిర్వహిస్తున్న డిజిటలైజేషన్ విధానాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. డేటా నమోదు, ఫారాల అప్‌లోడ్, వివరాల ధృవీకరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సూచించారు.జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) బీఎల్ఓలకు పూర్తి సహకారం అందిస్తూ ప్రతి అర్హ ఓటరిని గుర్తించాలని, ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.డిజిటలైజేషన్ పురోగతి తక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలను జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించి ప్రతిరోజూ సమీక్షించాలని ఆదేశించారు. అవసరమైన చోట అదనపు సిబ్బందిని వినియోగించి నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా విస్తృత చర్యలు చేపట్టాలని, పంపిణీ చేసిన ఫారాలను పూర్తి వివరాలతో నింపి ఈ నెల 14 లోగా సంబంధిత బూత్ లెవల్ అధికారులకు అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, అందిన ఎన్యూమరేషన్ ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే డిజిటలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా సమగ్రంగా ఎన్యూమరేషన్ నిర్వహించడం ప్రతి అధికారి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) శ్రీనివాస్, ఆర్డీఓ వెంకటేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.



## హెల్మెట్ ఫ్యాషన్ కాదు ... ప్రాణ రక్షణ

**ప్రజాపక్షం/గూడూరు:** హెల్మెట్ ధరించడం ఫ్యాషన్ కాదని ప్రాణ రక్షణ కోసమే అని సీఐ వినయ్ కుమార్ అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంపోందించేందుకు గూడూరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం హెల్మెట్ వినియోగంపై అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని గూడూరు సీఐ వినయ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా సీఐ వినయ్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో అధిక శాతం మంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే తలకు తీవ్ర గాయాలై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని సూచించారు.హెల్మెట్ ఫ్యాషన్ కాదు.. ప్రాణ రక్షణ కోసం అనే విషయాన్ని ప్రతి వాహనదారుడు గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు.ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని యువతతో పాటు అన్ని వయసుల వారు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు ర్యాలీలో పోలీసులు హెల్మెట్ ధరించి పట్టణంలోని ప్రధాన వీధులు గుండా ప్రయాణిస్తూ ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ గిరిధర్ రెడ్డి పోలీసులు అధికారులు సిబ్బంది పలువురు వాహనదారులు పాల్గోన్నారు.

## గూడూరు ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినికి బాసర ట్రిపుల్ ఐటిలో సీటు

**ప్రజాపక్షం/గూడూరు:** గూడూరు మండల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మరోసారి తన ప్రతిభను చాటుకుంది గత విద్యామరోసారి తన ప్రతిభను చాటుకుంది. గత విద్యా సంవత్సరం (2025–26)లో ఎస్ఎస్సీ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన ఈ పాఠశాల నుంచి మరో విద్యార్థిని ప్రతిష్ఠాత్మక బాసర ట్రిపుల్ ఐటిలో ప్రవేశానికి ఎంపిక కావడం విశేషం పాఠశాలకు చెందిన మాలోత్ దివ్య ఎస్ఎస్సీ పరీక్షల్లో 600కు 547 మార్కులు సాధించి పాఠశాల టాపర్గా నిలించింది.తన ప్రతిభతో బాసర ట్రిపుల్ ఐటిలో సీటు సాధించి గూడూరు మండలానికి గర్వకారణంగా నిలిచింది.ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం విద్యార్థినిని అభినందిస్తూ ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉన్నత విద్యలో ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

## కాంగ్రెస్, బిజెపి నుండి బిఆర్ఎస్‌లో చేరికలు

**ప్రజాపక్షం/ఖిలావరంగల్:** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 32వ డివిజన్ వినాయక కాలనీలో కాంగ్రెస్, బిజెపి పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు సోమవారం బిఆర్ఎస్‌లో చేరారు. వినాయక కాలనీ మాజీ అధ్యక్షుడు దేశబైనా రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు మేకల నర్సింగ్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, మాజీ ఎంఎల్ఏ నన్నపునేని నరేందర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నన్నపునేని నరేదర్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బిఆర్ఎస్ ప్రజల పక్షాన పనిచేస్తుడడంతోనే వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పొగాకు సందీప్, పరదేశి రాజేష్, ధోనికాల ప్రవీణ్, దస్తగిరి, మాటెటి శ్యామ్, పసునూరి సువర్ణ, సీతారాయుడు, నూక రమేష్, పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి ప్రజలే భాగస్వాములు



**ప్రజాపక్షం/నెక్కొండ:** గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యమే బలమైన పునాదిగా నిలుస్తోందని నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ అన్నారు. జిపిడిపి(గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక) 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తుది గ్రామసభను సోమవారం సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని శాఖలకు సంబంధించిన అభివృద్ధి అవసరాలు, మౌళిక వసతుల కల్పన, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజల ప్రాధాన్య అవసరాలపై సమగ్రంగా చర్చించారు. గ్రామ వార్షిక అభివృద్ధి ప్రణాళిక(జిపిడిపి) రూపకల్పనలో ప్రజల అభిప్రాయాలు, వార్డు సభ్యుల సూచనలు నమోదు చేసి తుది ప్రణాళికలో చేర్చనున్నట్లు తెలిపారు. సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి ప్రణాళిక ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండేలా ప్రతి ఒక్కరూ తమ సూచనలు అందించాలని కోరారు. అలాగే ఎస్ఐఆర్ ఫారాలను త్వరితగతిన సమర్పిస్తే వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసే చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామసభలో ఉప సర్పంచ్ శ్రావణి, వార్డు సభ్యులు మేరుగు విజయ్, బి రవి, కె ఉమా, యాట శ్రావణి, ఎం మౌనిక, ఎండి అమీర్, చల్లా విష్ణు వర్ధన్, రావుల మధుకర్ రెడ్డి, డి విజేందర్, రామారావు శిరీష, ఎం శ్రీకాంత్, కె విజయ, సిహెచ్ జ్యోతి, ఐకెపి సిఏలు అరుణ, వెంకటరమణ, శ్రీలేతో పాటు గ్రామస్తులు పాల్గొని తమ అభిప్రాయాలు, అభివృద్ధి సూచనలు వెల్లడించారు. గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యంతో రూపొందించిన జిపిడిపి ప్రణాళిక గ్రామ ప్రగతికి దిశానిర్దేశంగా నిలుస్తుందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

## మాస శివరాత్రి ఆరుద్ర నక్షత్ర ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపురం గ్రామంలోని పశుపతినాథ్ దేవస్థానం శివాలయంలో సోమవారం శివుని జన్మ ఆరుద్ర నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఉదయం వేద మంత్రోచ్చారణల నడుమ స్వామి వారికి పంచామృత సహిత మహా రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, విశేష అర్చనలు, మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం స్వామివారికి నైవేద్య సమర్పణ చేసి, ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు, ప్రసాదాల పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం అంతా శివనామస్మరణతో మారుమోగగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీ సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ, శివుని జన్మ ఆరుద్ర నక్షత్ర పర్వదినాన భక్తితో రుద్రాభిషేకం, బిల్వార్చన చేయడం వల్ల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. ఈ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందడం ఆనందదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గంజి భావన ఋషి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.

## అన్నదాతల ఆర్థికాభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం



**ప్రజాపక్షం/రాయపర్తి:** అన్నదాతలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి అన్నారు. మండలంలోని పెరికేడు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేసిన సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి, ఎంఎల్ఏ యశస్విని రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా ద్వారా అన్నదాతలకు ఎకరానికి 1200 ఆర్థిక సహాయాన్ని అందిస్తూ వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రభుత్వం, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణ మాఫీ చేసిందని గుర్తు చేశారు. అన్ని వర్గాల ఆర్థికాభివృద్ధి ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, కృష్ణారెడ్డి, మాచర్ల ప్రభాకర్, సర్పంచ్ తీగల సాయిలు, పాల్గొన్నారు.

## విద్యార్థులకు నట్టల నివారణ మాత్రల పంపిణీ



**ప్రజాపక్షం/నెక్కొండ:** జాతీయ నట్టల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం నెక్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రహేళ తన్వీర్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నట్టల నివాణ మాత్రల వలన పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమసయలు తగ్గి శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు. డాక్టర్ రహేళ తన్వీర్ మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు పేగుల్లోని నట్టలను నివారించి పిల్లల ఆరోగ్యాన్ని కాపాడతాయని చెప్పారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఈ మాత్రను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు రావుల మధుకర్‌రెడ్డి, మౌటం కృష్ణం రాజు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటలే శేయస్కరం



**ప్రజాపక్షం/గూడూరు:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం గణనీయంగా తగ్గిన నేపథ్యంలో రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు విధానాన్ని మార్చుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు.మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం వెంగంపేట గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ గుగులోత్ జవహర్ అధ్యక్షతన వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలు పంట మార్పిడి విధానాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ విస్తరణాధికారి చందన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది వర్షపాతం తీవ్రంగా తగ్గిందని తెలిపారు.దీంతో అధిక నీరు అవసరమయ్యే వరి మొక్కజోన్న పత్తి మిర్చి పసుపు వంటి పంటల సాగులో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకోని జోన్న సజ్జ వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా తక్కువ నీటితో మంచి దిగుబడులు సాధించవచ్చని వివరించారు.పంట మార్పిడి వల్ల భూసారం మెరుగుపడటంతో పాటు రైతులకు ఆర్థికంగా కూడా ప్రయోజనం కలుగుతుందని చేప్పారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్ ఉపసర్పంచ్ కట్ల భవాని విష్ణు గ్రామ కార్యదర్శి గన్న ఉపేందర్ వార్డు సభ్యులు ఉపేందర్ రవి రాఘవరెడ్డి సాయిలు రమేష్ భద్రు నర్నింహ నాగయ్య బిక్కు కొమురయ్య కిషన్ వెంకన్న పాల్గోన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎనగందుల మురళీ సతీమణి ఎనగందుల పుష్పలీలా అనారోగ్యంతో మరణించగా ఆమె పార్థివ దేహానికి సోమవారం పాలకుర్తి ఎంఎల్ఏ మామిడాల యశస్విని రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎంఎల్ఏ వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యానాయక్, మాచర్ల ప్రభాకర్, పెండ్లి మహేందర్ రెడ్డి, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, ఇల్లందుల భగవాన్, పిరని ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

## బల్దియాలో ప్రజావాణి(గ్రీవెన్స్)

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** సోమవారం ప్రజావాణి(గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిడబ్ల్యూఎంసి ప్రధాన కార్యాలయ కౌన్సిల్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనాతో పాటు వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు నగర ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అందజేసిన దరఖాస్తులను స్వీకరించి వాటిని ఆయా విభాగాలకు చెందిన అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా టౌన్ ప్లానింగ్ 58, ఇంజనీరింగ్ 36, రెవెన్యూ 06, హెల్త్, శానిటేషన్07, నీటి సరఫరా 02, హార్టికల్చర్ 02, మొత్తం 111 వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి సిపి రవీందర్ రాడేకర్, అకౌంట్స్ అధికారి శివలింగం, పన్నుల అధికారి రామకృష్ణ, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, సెక్రటరీ అనిల్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని నగరంలోని మెట్టుగుట్టపై గల శ్రీ మెట్టు రామలింగేశ్వరస్వామి, శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకొని స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. మెట్టురామలింగేశ్వర స్వామివారికి అన్నపూజ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ సత్యనారాయణ ఆధ్వర్యంలో శివాలయ పునరుద్దరణ కమిటీ చైర్మన్ పైడిపాల రఘుచందర్ సమక్షంలో అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భోగి కేదారి, బైరి రాజు, దండిగం శ్రీనివాస్, రొడ్డ దయాకర్ వస్కుల ఉమ, మాడిశెట్ట జ్ఞానేశ్వరి, భక్తులు, ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ములుగు ఎస్‌పిని కలిసిన ఎస్ఐ

ప్రజాపక్షం/ములుగు: ములుగు పోలీస్‌స్టేషన్ ఎస్ హెచ్‌ఓగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్ వెంకటేష్ సోమవారం జిల్లా ఎస్‌పి కేకాన్ సుధీర్ రామ్‌నాథ్ ఐపిఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్కను అందజేశారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ ప్రజలకు స్నేహపూర్వక పోలింగ్ అందించడంతో పాటు నేరాల నియంత్రణలో కఠిన వైఖరి అవలంభించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించే దిశగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తనపై ఉంచిన విశ్వాసానికి ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణకు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తానని చెప్పారు.

# వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం సాధ్యం

ప్రజాపక్షం/గూడూరు: వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం సాధ్యపడుతుందని బాలికలు తప్పకుండా డి వార్మింగ్ మాత్రలను వేసుకోవాలని గూడూరు సర్పంచ్ సునీత కొమ్మాలు నాయక్ అన్నారు. గూడూరు మండలం కేంద్రంలోని చంద్రుగూడెంలో బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన సునీత కొమ్మాలునాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు నులిపురుగుల నివారణ వ్యక్తిగత పరిశుభ్రత ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించారు.పిల్లలు బయటకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా చెప్పులు ధరించాలని గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించి పరిశుభ్రంగా ఉంచుకోవాలి సూచించారు. ఎల్లప్పుడూ సురక్షితమైన తాగునీరు మాత్రమే తాగాలని వేడి ఆహారాన్ని తీసుకోవాలని పండ్లు కూరగాయలను బాగా కడిగిన తర్వాతే వినియోగించాలని తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రభుత్వం అంగన్‌వాడి కేంద్రాలు పాఠశాలల ద్వారా అందించే డీవార్మింగ్ మాత్రలను తప్పనిసరిగా ఉండటంతో పాటు రక్తహీనత పోషకాహార లోపం వంటి సమస్యలను నివారించవచ్చని వివరించారు.ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు శిరిష వైద్య సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణతో పిల్లల ఆరోగ్యం మెరుగు

ప్రజాపక్షం/ములుగుః పిల్లల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం దోహదపడుతుందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. సోమవారం ములుగులోని జ్యోతిరావుపూలే బిసి బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నులిపురుగుల వలన రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు వస్తాయని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, శుభ్రమైన నీరు తాగడం, పాదరక్షలు ధరించడం ద్వారా వీటిని నివారించవచ్చన్నారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 73,444 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నాగ అన్వేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి సంపత్, పాఠశాల ప్రిన్సిపాల్ నర్మదాబాయి, వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలి



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారానికి సమర్పించిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులను సత్వరమే పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి 282 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఆనెన్లైన్లో పెండింగ్ లో ఉన్న అర్జీలను సంబంధిత శాఖల అధికారులు వేగవంతంగా పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఆలస్యం చేయొద్దని అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వర్చువల్ విధానంలో పలువురు తహసిల్దార్లతో కలెక్టర్ మాట్లాడి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, జడ్పీ సీఈవో శేషాద్రి, డి ఆర్ డి ఓ మేన శ్రీను, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# భూ నిర్వాసితులకు, స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి



ప్రజాపక్షం/కాజీపేట : తెలంగాణ రాష్ట్రంలో కాజీపేట ప్రాంతంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని పోరాడి సాధించుకున్నామని, స్థానికులకు భూ నిర్వాసితులకు ఉద్యోగాలు వస్తాయని ఆశించామని తెలంగాణ రైల్వే జేఏసీ ఛైర్మన్ కొండ్ర నర్సింగరావు, కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ తెలిపారు. సోమవారం రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ముందు ఈనెల 19న మడికొండ నుండి కాజీపేట వరకు జరుగు ప్రజా ప్రదర్శనను జయప్రదం చేయాలని గోడ పత్రికను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రజా ప్రదర్శనలో భూ నిర్వాసితులు, విద్యార్థులు, రాజకీయ పార్టీలు అధిక సంఖ్యలో పాల్గొని కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఈ సందర్భంగా తెలిపారు. తెలంగాణ రైల్వే జేఏసీ, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో భూ నిర్వాసితులతో పాటు రైల్వేలో అక్ట్ అప్రెంటిషిప్ పూర్తి చేసిన, కాజీపేట్ పరిసర గ్రామాల, ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుద్యోగులకు అందులో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అదేవిధంగా ఈ ప్రాంత ప్రజల 40 సంవత్సరాల ఆకాంక్ష అయినటువంటి కాజీపేట్ రైల్వే డివిజన్ ఏర్పాటు కోసం మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టిన సందర్భంగా 19న ఆదివారం మడికొండ గ్రామంలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహం నుండి కాజీపేట్ రైల్వే స్టేషన్ వరకు చేపట్టిన టువంటి శాంతియుత పాదయాత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ రైల్వే జేఏసీ ఛైర్మన్ కొండ్ర నర్సింగరావు, కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, ప్రజాసంఘాల ఐక్యవేదిక కార్యదర్శి , సిపిఎం జిల్లా నాయకులు ఎం. చుక్కయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కుమారస్వామి, ఎస్. రమేష్ పాల్గొన్నారు.

# మాధవి రావులపాటికి కేయూ డాక్టరేట్



ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ : కాకతీయ విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ మానేజ్మెంట్ విభాగ పరిశోధక విద్యార్థిని మాధవి రావులపాటి కి విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల డాక్టరేట్ ప్రకటించారు, డాక్టర్ మాధవి రావులపాటి "ఇన్వెస్టర్స్ పెర్సెప్షన్ టువర్డ్స్ ఫైనాన్సియల్ ఇన్వెస్ట్మెంట్ అవెన్యూస్ ఇన్ రూరల్ ఏరియాస్ – ఎ స్టడీ అనే అంశం పై విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య వి.వి. సుబ్రమణ్య శర్మ పర్యవేక్షణలో పూర్తీ చేసారు, హనంకొండ కు చెందిన డాక్టర్ మాధవి రావులపాటి ప్రస్తుతం హసనపర్తి లోని, భూపాలపల్లి తెలంగాణా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ మాధవి రావులపాటి ని అభినందించారు.

# ప్రజా స్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు పునాది



ప్రజాపక్షం/హసన్‌పర్తి: ప్రజా స్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు పునాది వంటిదని ప్రతి అర్హత కలిగిన వ్యక్తి ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకొని ఆహక్కును పరిరక్షించుకోలని 1వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చి||. రామ్ గౌడ్ పెగడపల్లి గ్రామ ప్రజలకు సూచించారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ 1వ, డివిజన్ పెగడపల్లివర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకుఓటర్ నమోదు ప్రక్రియ లో భాగంగా సోమవారం బిఎల్ఓలు,బిఎల్ఎలు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి చి|| రాము గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సీరియస్‌గా తీసుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు పునాది వంటిదని, ప్రతి అర్హత కలిగిన వ్యక్తి ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకుని ఆ హక్కును పరిరక్షించుకోవాలని అన్నారు. సర్ ప్రక్రియ గురించి కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎలకు వివరిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు జాబితా ప్రక్షాళన కోసం ఎన్యూమరేషన్ ప్రక్రియ లో భాగంగా బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను సేకరించాలన్నారు. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ప్రక్రియనువిజయవంతం చేయడంలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు పార్టీ నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవిన్యూ అధికారులు సతీష్ గ్రామ బి ఎల్ ఓలు, బిఎల్ఎలు నాయకులు సంపత్ యాదవ్, యం డి యాకుబ్ పాషా,రవి యాదవ్, శ్రీను యాదవ్, చిట్టి నర్సయ్య ముచ్చు నంద కిషోర్, కిష్టయ్య, గంట రాజిరెడ్డి, చిన్న దామెర రాజు, చార్లెస్, లాజరస్, పోలేపాక ఉపేంద్రం, కోర్నెలు , ధామెర ప్రసాద్, దబ్బా శ్రీను, తాళ్లపల్లి చిన్న రాజన్న, ఎల్లగౌడ్ ప్రజలు పాల్గొన్నారు.

# రాజా ఏకాంబరానికి కలెక్టర్ చేతుల మీదుగా ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రధానం

ప్రజాపక్షం/రఘునాథపల్లి: రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన పసునూరి సురేష్ రమ్య దంపతుల కుమారుడు రాజా ఏకాంబరం ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పంజాబ్ వారు ఆన్లైన్లో నిర్వహించిన క్విజ్ కాంపిటీషన్లో తన ప్రతిభను చాటి సూపర్ టాలెంటెడ్ కిడ్ గా ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించడం జరిగింది. ఈ సందర్భంగా సోమవారం జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చేతుల మీదుగా రాజా ఏకాంబరం తన తండ్రితో కలిసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్ ను అందుకోవడం జరిగింది. అనంతరం కలెక్టర్ బాలున్ని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని క్విజ్ కాంపిటీషన్లో గెలుపొంది. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అయన అన్నారు. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో బాలుడు స్థానం సంపాదించడం పట్ల పాఠశాల యాజమాన్యం సైతం బాలున్ని అభినందించారు.

# గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ప్రజాపక్షం/బచ్చన్నపేట: లింగంపల్లి గ్రామంలో భూవివాదాల నేపథ్యంలో తరచు గొడవలకు పాల్పడుతున్న కర్ర రామిరెడ్డి, కర్ర పద్మారెడ్డి కుటుంబాల సభ్యులను సోమవారం తహశిల్దార్ ఎదుట బచ్చన్నపేట పోలీసులు బైండోవర్ చేశారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీకాంత్ హెచ్చరించారు. భూ వివాదాలను చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని, గ్రామాలలో ప్రశాంత వాతావరణం నెలకొనేందుకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలన్నారు.

# ఎల్లయ్య మృతి బిఆర్ఎస్‌కి తీరనిలోటు

ప్రజాపక్షం/దేవరుప్పుల: మండలంలోని కోలుకొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు యమగాని ఎల్లయ్య మృతిచెందగా పార్టీకి, గ్రామానికి తీరనిలోటని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు తీగల దయాకర్, మాజీ ఎంపీపీ సావిత్రి, మల్లేశం, జిల్లా యువజన నాయకులు కోతి ప్రవీణ్ గౌడ్‌లు ఎల్లయ్య మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సోమన్న, బిక్షపతి, హనుమంతు, ఖాసిం, ఎల్లేష్, మోహన్, యాకస్వామి, రాంమూర్తి, ఇంద్రస్వామి, చౌడూరు ఉప సర్పంచ్ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# ఉపముఖ్యమంత్రి ప్రారంభించిన విద్యుత్ సబ్ స్టేషన్ ఎప్పడు ఉపయోగపడుతుంది

ప్రజాపక్షం/జఫర్‌గఢ్: ఇటీవల రాష్ట్ర ఉపముఖ్యమంత్రి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించిన సాగరం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఇప్పటికే రైతులకు విద్యుత్ సరఫరా అందించకపోవడంతో తీవ్ర నిరాశక గురి చేస్తుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్‌ను రైతు సంఘం తరుపున సంప్రదించగా సబ్ స్టేషన్‌కు సంబంధించిన పనులు ఇంకా పూర్తి కాలేదని, కాంట్రాక్టర్ పనులు చేయడానికి రావడం లేదని పూర్తి స్థాయిలో విద్యుత్ సఫరా ప్రారంభం కావడానికి మరో 2, 3 నెలలు పట్టే అవకాశం ఉందని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి యాకయ్య, శ్రీనివాస్, మల్లయ్య, రవి, నరసయ్య, రవి, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్‌డిఒ కృష్ణవేణి

ప్రజాపక్షం/ములుగుః ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎన్నికల నమోదు అధికారి, ఆర్‌డీఓ కృష్ణవేణి వెంకటాపూర్ మండలం లక్ష్మీ దేవిపేట, బుర్గుపేట గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, బిఎల్ఓ యాప్‌లో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత బిఎల్ఓలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ మండల తహసీల్దారు గిరిబాబు, డిప్యూటీ తహసీల్దారు భవాని ప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు నితీష్, బిఎల్ఓలు సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్ తప్పనిసరి

**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:** కన్నాయిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డిప్యూటీ డీఎంహెచ్ వో, క్రాంతికుమార్, హాజరై సిబ్బంది పనితీరు రికార్డ్ లు పరిశీలించారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం భాగంలో 1, నుంచి 19 సం, వయస్సు గల పిల్లలకు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలుర) పాఠశాల కన్నాయిగూడెం, గుర్రేవుల జడ్పిహెచ్ఎస్, తదితర పాఠశాలలలో మరియు అంగన్వాడి కేంద్రాలలో ఆల్బెండజోల్ టాబ్లెట్లు చిన్న పిల్లలు, విద్యార్థులకు వేశారు. డాక్టర్ స్నేహ రెడ్డి, (ఎంఎల్హెచ్పి) పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ చేతుల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టిక ఆహారం, ఆరోగ్యం, గురించి విద్యా బోధన చేశారు, సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు, హెల్త్ అసిస్టెంట్స్ లక్ష్మణ్, భాస్కర్, ఎఎన్ఎం కవిత, సబితా, లక్ష్మి, ఊర్మిళ, పుణ్యవతి, సమ్మక్క, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లు పంపిణీ

**ప్రజాపక్షం/వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండలంలోని ఎంపీ యూపీఎస్ పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. గుమ్మడిదొడ్డి సర్పంచ్ బోదెబోయిన భరత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం లలిత, ఆశా వర్కర్ శివకుమారి నులిపురుగుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గిరిప్రసాద్, ఉపాధ్యాయులు నాగార్జున, రాజు, ఇతర ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## చల్వాయి మోడల్ స్కూల్ విద్యార్థులకు రోబోటిక్స్ లో శిక్షణ

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** సోహం రోబోటిక్ కంపెనీ వారు మోడల్ స్కూల్ చల్వాయిలో చదువుతున్న విద్యార్థులకు ఇంజనీరింగ్ స్థాయిలో చేసే రోబోటిక్స్ లాంటి అంశాన్ని పాఠశాల స్థాయిలోనే నేర్పించి భవిష్యత్తులో వారు ఇంజనీరింగ్ లాంటి ఉత్తమ కోర్సులను చేసి ఉత్తమ కెరియర్ ను సాధించే విధంగా పునాది పాఠశాల స్థాయిలోనే పడేలా ప్రేరేపించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది విద్యార్థులు ఆర్డినో యు నో బ్రెడ్ బోర్డ్ మరియు ఇతర కాంపోనెంట్స్ ను యూస్ చేసి 21 ఆక్టివిటీస్ చేశారు.

ఇందులో 15మందిని ఎంపిక చేసి మోక్షిత్ ఎయిత్ క్లాస్ కెప్టన్‌గా వర్షిత శ్రావ్య వైస్ కెప్టన్‌గా ఎంచుకొని ఒక రోబోటిక్స్ పరికరాలకు సంబంధించిన కిట్టును విద్యార్థులకు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమలో ప్రతిభ కనబరిచిన 15మందికి సర్టిఫికెట్స్ బుక్స్ దానికి సంబంధించిన మెటీరియల్ ను సోహం రోబోటిక్స్ కంపెనీ వారు ఇచ్చారు అత్యుత్తమ నాణ్యమైన విద్య మోడల్ స్కూల్లో అందించేందుకు లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు మోడల్ స్కూల్లో విద్యార్థులకు చేపడుతామని తల్లిదండ్రులందరూ ప్రభుత్వ పాఠశాలలనే నాట్యం నాణ్యమైన విద్య దొరుకుతుంది అని విశ్వసించేందుకు వీలుగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని సోహమ్ రోబోటిక్ కంపెనీ వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ ప్రిన్సిపల్ గందు కుమార్ ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్స్ అందజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాలలోని రోబోటిక్స్ ల్యాబ్ ఇన్చార్జ్ శ్రీ మర్రి హారిక రోబోటిక్స్ శిక్షణ కోసం వచ్చిన అరవింద్ దేవందర్ లు పాల్గొన్నారు.

# వరంగల్ పోలీస్ శాఖలో పెరుగుతున్న క్రీడా స్ఫూర్తి

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** రాష్ట్ర పోలీస్ క్రీడల్లో ప్రత్యేకతను కనపరుస్తున్న వరంగల్ పోలీస్ శాఖకు చెందిన పోలీస్ క్రీడాకారులను వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతా ఐపీఎస్ అభినందించారు.వరంగల్ పోలీసులు క్రీడల్లో రాణిస్తుండడం అత్యంత శుభ పరిణామమని పోలీస్ వర్గాలు అభినందనలు తెలియజేస్తున్నాయి.వరంగల్ పోలీస్ శాఖలో క్రీడల్లో పాల్గొంటున్న పోలీస్ క్రీడాకారులకు ప్రత్యేకమైన తర్ఫీదును ఇప్పించగలిగితే రానున్న కాలంలో అత్యంత విలువైన క్రీడా స్ఫూర్తిని కనపరిచి అన్ని రకాల బహుమతులను తీర్చుకోగలరని వరంగల్ పోలీస్ అధికారులు పోలీస్ సిబ్బంది ఆశాభావాన్ని వ్యక్తపరుస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా అంగరంగ వైభవంగా నిర్వహించబడిన 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ స్పెషల్ పార్టీ పోలీసులు సత్తా చాటారు. మల్కాజ్గిరి కమిషనరేట్ లో ప్రారంభమమైన 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్ పోటీల్లో, క్రీడాల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రీడా పతకాలు బాక్సింగ్ విభాగంలో మహిళా విభాగం నుండి ఇ.జమున ఉమెన్ ఏ.ఎస్.ఐ కేజీ 7580 విభాగం సిల్వర్ మెడల్. బి.శోభ రాణి ఉమెన్ ఏ.ఎస్.ఐ కేజీ 7075విభాగం బ్రాంజ్ మెడల్. ఎన్.స్వర్ణలత రెడ్డి ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ కేజీ 8085విభాగం బ్రాంజ్ మెడల్,ఎన్. సుజాత ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ కేజీ 6570 బ్రాంజ్ మెడల్.స్వర్ణ భారతి ఉమెన్ పిసి 5055 విభాగం గోల్డ్ మెడల్. దివ్య శ్రీ ఉమెన్ పిసి కేజీ 5560 విభాగం గోల్డ్ మెడల్.సుష్మ ఉమెన్ పిసి కేజీ 4550 విభాగం బ్రాంజ్ మెడల్. సౌజన్య ఉమెన్ పిసి కేజీ 4550 విభాగం బ్రాంజ్ మెడల్స్ ని సాదించారు.అలాగే పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపీఎస్ అభినందించారు.పోలీసులు శాంతి భద్రతల్లోనే కాదు క్రీడల్లో కూడా రాణించగలరని, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి శాఖపరమైన గుర్తింపు వుంటుందని సీపీ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వేముల శ్రీనివాస్,అడిషనల్ డిసిపి సురేష్ కుమార్,అడిషినల్ డీసీపీ ఆర్.ప్రభాకర్ రావు,అడిషినల్ డీసీపీ బాలస్వామి,ఏసీపీ నాగయ్య,ఏసిపి సురేంద్ర ఆర్ ఐ అడ్మిన్ స్పర్జన్ రాజ్, ఆపరేషన్స్ ఆర్.ఐ ఉదయ భాస్కర్,ఆర్.ఎస్.ఐ శరత్ కుమార్,ఆర్,ఎస్.ఐ రమేష్ అలాగే పోలీస్ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజా ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రజలకు మెరుగైన సేవలను అందుబాటులోకి తీసుకొస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్లపల్లి మండలం మహాత్మా జ్యోతి బాపులే ఎం జె పి గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు* ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 1 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు నులిపురుగుల నివారణకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం మాత్రలను అందజేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రజలకు మెరుగైన సేవలను అందుబాటులోకి తీసుకొస్తోందని తెలిపారు. విద్యార్థుల కాస్మెటిక్, మెస్ ఛార్జీలను పెంచి నాణ్యమైన, ఆరోగ్యకరమైన భోజనాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, డీఎంహెచ్ఓ, పాఠశాల ప్రిన్సిపాల్, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల పార్టీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మొగుళ్లపల్లి మండల తహసీల్దార్, పీఏసీఎస్ చైర్మన్, చిట్యాల మార్కెట్ వైస్ చైర్మన్, స్థానిక సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆకాశం వైపు అన్నదాత చూపు

**ప్రజాపక్షం/తాడ్వాయి:** ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రోజులు గడుస్తున్నా వరుణుడి కటాక్షం లభించకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తొలకరి పలకరింపుతో చేతినిండా పని దొరుకుతుందని ఆశించిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. ప్రతిరోజూ ఆకాశం వైపు ఆశగా చూడటం, మబ్బులు కమ్ముకొస్తున్నట్లే వచ్చి విడిపోతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. తాడ్వాయి మండలంలో వర్షాధారం మీదనే ఆధారపడి పంటల సాగు ఆధారపడి ఉంటుంది. సకాలంలో వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో ఇప్పటికే కొందరు రైతులు పత్తి మొక్కజొన్న కందులు విత్తనాలు వేయగా, మరికొందరు నారుమళ్లు పోశారు. అయితే, ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో వేసిన విత్తనాలు మొలకెత్తక, మొలకెత్తిన విత్తనాలు పోసిన నారుమళ్లు నీరందక ఎండిపోతున్నాయి. మరికొన్ని గ్రామాల్లో భూములు బీడులుగానే దర్శనమిస్తున్నాయి. పెట్టుబడులు పెట్టి కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు వృథా అవుతాయేమోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.భూములను దుక్కి దున్ని సిద్ధం చేసుకున్న రైతులు, వర్షం వస్తేనే విత్తనాలు వేయాలనే ఉద్దేశంతో వేచి చూస్తున్నారు. వాతావరణం ఇలాగే ఉంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం భారీగా తగ్గే ప్రమాదం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా వరుణ దేవుడు కరుణించి సకాలంలో వర్షాలు కురిసి, తమను ఆదుకోవాలని అన్నదాతలు భగవంతుడిని ప్రార్థిస్తున్నారు.

# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజా దివాస్ సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్ అధికారులను ఆదేశించారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మొత్తం 17 ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విని, వాటిపై వెంటనే స్పందించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి మధ్యవర్తులు లేదా పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సమన్వయంతో వాటిని త్వరిత గతిన పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

## రైతులకు అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జిల్లా సమాచార ప్రసార కార్యచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం మండలంలోని మరిగడి గ్రామంలో వానాకాలం 2026లో నెలకొన్న వర్షాపాతం లోటు పరిస్థితులు, పంటలు వైవిధ్యీకరణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో రైతులు ఆందోళన చెందకుండా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ సాగును కొనసాగించాలన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పరుశరాములు, వార్డు సభ్యులు కమలాకర్, వ్యవసాయ విస్తరణ అధికారి అనిల్ కుమార్, పంచాయితి కార్యదర్శి ప్రవీణ్, నాయకులు రజిత శ్రీనివాస్, చిరంజీవి, కిష్టయ్య, నరసయ్య, బిక్షపతి, స్వామి, లక్ష్మ య్య, తదితరులు పాల్గొన్నారు.

## రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రజాపక్షం/కొడకండ్ల:** రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని కొడకండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ అన్నారు.

రైతు బరోసా నిధులను 9 రోజులలోనే రైతుల ఖాతాలో జమ చేసి పెట్టుబడి సాయం అందించిన సందర్భంగా సోమవారం కొడకండ్ల మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సి రాజేందర్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణి చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు, ఏఎంసీ డైరక్టర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నులి పురుగుల నివారణకు ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో బాలికల పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందు సూపర్ వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో పంపిణి చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నులి పురుగు నివారణకు కృషి చేయాలని అందుకు వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమన్నారు. నులి పురుగుల నివారణ మందులు చిన్నారులు, యువత ఆరోగ్యంగా ఎదగడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, హెల్త్ అసిస్టెంట్ వేణు, ఏఎన్ఎం వసంత, రాణి, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## ఇసుక లారీల పార్కింగ్‌పై కలెక్టర్‌కు సర్పంచ్ సరిత ఫిర్యాదు

**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం మద్దులపల్లి ప్రధాన రహదారిపై ఇసుక కాంట్రాక్టర్‌లు తమ ఇష్టానుసారంగా నిత్యం వందలాది ఇసుక లారీలను పార్కింగ్ చేయడంతో ప్రయాణీకులు,వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మద్దులపల్లి సర్పంచ్ ఎల్పుల సరిత జిల్లా కలెక్టర్‌కు అందించిన వినతిపత్రంలో ఫిర్యాదు చేసారు.ప్రధాన రహదారిపై భారీగా లారీలను గంటల కొద్ది నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో ప్రమాదాల ముప్పు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆమె తెలిపారు.ముఖ్యంగా ఆర్టీసి బస్సులు,పాఠశాల వాహనాలు,అత్యవసర సేవల కోసం వెళ్ళే అంబులెన్స్‌లు సైతం సకాలంలోప్రయాణించలేని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేసారు.ఈ సమస్యపై గతంలో సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికి శాశ్వత పరిష్కారం లభించలేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.ప్రజల ప్రాణాలు,భద్రతల దృష్ట్యా ప్రధాన రహదారిపై ఇసుక లారీల పార్కింగ్‌ను పూర్తిగా నిషేదించి,ప్రత్యామ్నాయ పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయడంతో పాటు నిభందనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్‌ను సర్పంచ్ సరిత కోరారు.గ్రామ ప్రజలు,ప్రయాణీకుల సౌకర్యార్థం ఈ సమస్యను అత్యవసరంగా చర్యలు తీసుకోవాలని ఆమె కలెక్టర్‌ను కోరారు.

## విద్యుత్ ఘాతంతో గేదె మృతి

**ప్రజాపక్షం/మంగపేట :** మండలంలోని చెరుపల్లి (కొత్తపేట) గ్రామంలో సోమవారం ఉదయం త్రీఫేస్ విద్యుత్ సరఫరా అవుతున్న సమయంలో ప్రమాదవశాత్తు రైతు బరపటి నరసింహారావుకు చెందిన గేదె విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందింది. ఈ ఘటనపై విద్యుత్ శాఖ అధికారులు అత్యంత వేగంగా, సానుకూలంగా స్పందించి బాధిత రైతుకు అండగా నిలిచారు.



## ఎన్‌సిసి క్యాడెట్ల ఎంపిక

**ప్రజాపక్షం/పాపన్నపేట :** మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో సోమవారం ఎన్సిసి మొదటి సంవత్సరం క్యాడేట్ల ఎంపిక కార్యక్రమం ఎన్సిసి అధికారి శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్మీ అధికారి సర్వన్ సింగ్ హాజరై విద్యార్థులకు వివిధ రకాల ఈవెంట్స్ నిర్వహించి 53 మంది క్యాడెట్లను ఎంపిక చేశారు. ఈ ఎంపిక కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మహేశ్వర్, మాజీ ఎన్సిసి అధికారి ప్రవీణ్ కుమార్,భట్టు నాగరాజు తోపాటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఉచిత బస్సు పాసుల పంపిణీ

**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** మనోహరాబాద్ మండలంలోని గౌతోజిగూడ గ్రామ విద్యార్థులకు ఉప సర్పంచ్ ఎర్ర నాగరాజు తన సొంత ఖర్చులతో సోమవారం ఉచిత బస్ పాసులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిద్దిపేట జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి నత్తి మల్లేష్ ముదిరాజ్ హాజరై విద్యార్థులకు బస్సు పాసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టుబడి పెట్టడమే నిజమైన సేవ అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు రవాణా ఖర్చుల వల్ల చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో,ఉప సర్పంచ్ ఎర్ర నాగరాజు తన సొంత నిధులతో ఈ కార్యక్రమం చేపట్టడం ఎంతో అభినందనీయం కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బక్క వెంకటేష్ గౌడ్, బిజెపి బూత్ అధ్యక్షులు ఎర్ర శేఖర్, స్వామి, నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన బండారి వెంకటేశంకు మంజూరు అయిన సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు వరం అని, మెడికల్ ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బండారి వెంకటేశం, బండారి గోపి, మ్యాదర్ల రాజు, పిల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నత్తనడకన ఓటరు జాబితా సవరణ నమోదు ప్రక్రియ

### 50 శాతం దాటని సమగ్ర సవరణ



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్ :** మండలంలో ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఆర్ఐ) ప్రక్రియ నత్తనడకన కొనసాగుతుంది. రెండు రోజుల్లో 70 శాతం సవరణ పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేస్తున్నప్పటికీ బూత్‌లేవల్ అధికారుల పనితీరులో మాత్రం మార్పు రావడం లేదు. సమయం దగ్గర పడుతున్న జగదేవ్‌పూర్ మండలంలో 50 శాతం ఓటరు జాబితా సవరణ పూర్తి కాకపోవడం మండల స్థాయి అధికారులు బిఎల్‌ఓల పనితీరుపై ఆసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఓటరు జాబితా సవరణ ప్రారంభ సమయంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రచార ఆర్భాటం కోసం అడావిడి చేసిన ప్రస్థుతం స్థాకంగా బూత్‌లేవల్ అధికారులకు సహకరించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. 2002 ఓటరు జాబితాలో ఆ తర్వాత కాలంలో పేర్లున్న ఓటర్లందరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసిన ఫారాలను నింపి బిఎల్‌ఓలకు అందజేయడం సమస్యగా మారింది. ఎక్కువ శాతం ఓటర్లకు అవగాహాన లేకపోవడంతో ఫారాలను పూర్తి చేయకుండా తమ వద్దనే ఉంచుకోవడంతో ఈ పక్రియ జగదేవ్‌పూర్ మండలంలో నత్తనడకన సాగుతుంది. కాగా చాలా మందికి 2002లో తమ ఓటు ఎక్కడుందనేది తెలియక, ఏ పోలింగు బూతులుందో కనుక్కోకవడం వారికి తలనొప్పిగా మారింది. అంతేగాకుండా సాంకేతిక పరిజ్ఞానం లేని ఓటర్ల పరిస్థితి మరింత ఇబ్బందిగా మారింది. అయితే బిఎల్‌ఓలు సర్ ఫారాలు నింపుకొని స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయాలకు తీసుకురావాలని చెప్పడంతో ఓటర్లు ఆయోమయానికి గురవుతున్నారు. స్థానిక తహసీల్దార్ నిర్మల సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని గ్రామాలలో పర్యాటించి బిఎల్‌ఓలపై ఒత్తిడి పెంచిన ఆశించిన స్థాయిలో ఓటరు జాబిత సవరణ ముందుకు సాగడం లేదు.

## ఫ్రిడ్జ్ పేలుడుతో ఆపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

### 40 కుటుంబాలను కాపాడిన అగ్నిమాపక పోలీసు సిబ్బంది



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** సంగారెడ్డి పట్టణంలో విద్యానగర్ కాలనీ ప్రాంతం గాయిత్రీ శ్రీనివాస ఆపార్ట్మెంట్‌లో ఫ్రిడ్జ్ పేలడంతో జరిగిన అగ్నిప్రమాదంలో ఓ ఫ్లాట్ పూర్తిగా కాలిబూడిద కాగా, అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ సిబ్బంది సమయస్పూర్తితో తక్షణమే స్పందించడంతో భారీ ప్రమాదం తప్పి ఆపార్ట్మెంట్‌లో నివసిస్తున్న సుమారు 40 కుటుంబాలు సురక్షితంగా బయటపడ్డాయి. ఒక్క సారిగా ఫ్రిడ్జ్ పేలడంతో మంటలు వేగంగా వ్యాపించి ఫ్లాట్‌ను చుట్టుమట్టగా, సమాచారం అందుకున్న అగిమాపక సిబ్బంది తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆదుపులోకి తీసుకువచ్చారు. అదే సమయంలో పోలీసు సిబ్బంది ఆపార్ట్మెంట్‌లోని నివాసితులను అప్రమత్తం చేసి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ సహాయక చర్యలను సమన్వయం చేశారు. ప్రమాద సమయంలో ఆందోళనకు గురైన చిన్నారులు, మహిళలు, వృద్ధులకు ధైర్యం చెప్పి పరిస్థితిని ఆదుపులోకి ఉంచడంలో అధికారులు కీలకపాత్ర పోషించారు. సమీప ఫ్లాట్లకు మంటలు వ్యాపించకుండా వేగంగా చర్యలు చేపట్టడంతో మరింత ఆస్తి నష్టం,ప్రాణ నష్టం తప్పిందని స్థానికులు తెలిపారు. అగ్ని ప్రమాదంలో ఫ్లాట్‌లోని గృహోపకరణాలు, ఫర్నిచర్, ఇతర వస్తువులు, పూర్తిగా దగ్ధమైనప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట నిచ్చింది. ప్రమాద సమయంలో చూపిన అప్రమత్తత, సేవాభావం, వేగవంతమైన స్పందనకు గుర్తింపు గా గాయిత్రి శ్రీనివాసం ఆపార్మ్టెంట్ నివాసితులు అగ్నిమాపక శాఖ,పోలీసు శాఖ సిబ్బందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ఆలస్యం చేయకుండా అర్హతల మేరకు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆయా శాఖ అధికారులకు ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు సమస్యల పరిష్కారంపై నమ్మకంతో ప్రజావాణి కి వస్తున్నందున ప్రతి ఫిర్యాదును పరిశీలించి, నిబంధనలప్రకారం వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో 109 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ నాగరాజమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, ఎస్‌డీపీ సుదర్శన్ తో పాటు జిల్లా అధికారులు ఉన్నారు.

## చిన్నారుల ఆరోగ్యానికి ‘ఆల్బెండజోల్ కవచం’

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి

**ప్రజాపక్షం/సిద్దిపేట జిల్లా ప్రతినిధి :** వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా కలెక్టర్ హైమవతి తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని కొండపాక మండలం దుద్దెడ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆల్బెండోజ్ మాత్రలను పిల్లలకు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎదిగే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యం గా ఉండాలని ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, గోర్లు వారానికొకసారి కట్ చేసుకోవాలని, వేడి చేసిన మంచినీటిని తాగాలని సూచించారు. ఆహారం పైన ఈగలు వాలకుండా మూతలు పెట్టాలని పండ్లను బాగా కడుక్కుని తినాలని భోజనం చేసేముందు మరుగుదొడ్లు వెళ్ళినప్పుడు చేతులు బాగా సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని విద్యార్థులకు తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి చుట్టుపక్కల, పాఠశాలలో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ధనరాజ్, ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్, వైద్యశాఖ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## కాయిధంపల్లిలో మంచినీటి కరువు

### ప్రజావాణిలో ఖాళీ బిందెలతో ఫిర్యాదు

**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** తాగునీటి కష్టాలు వెంటనే తీర్చాలని కోరుతూ సోమవారం మండల పరిధిలోని కాయితంపల్లి ఎస్సీ కాలనీ వాసులు ప్రజావాణి లో ఎంపిడిఒ వేద ప్రకాష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు, నాలుగు నెలల నుండి ఎస్సీ కాలనీలో తాగునీరు సరిగా అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎన్నిసార్లు సర్పంచ్, కార్యదర్శికి తెలిపిన పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ పథకం ద్వారా అందించే తాగునీటి సరఫరా అరకోరగా అందుతుందని దీంతో కాలనీలో మంచినీటి సమస్య ఎదురవుతుందని ఈ విషయంపై సర్పంచుకు చెబితే పైనుండే నీరు సరిగ్గా రావడంలేదని చెప్తున్నారు. తమకు న్యాయం జరగడం లేదని ఆగ్రహించిన కాలనీవాసులు ఖాళీ బిందెలతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి తమ గోడును వెళ్లబోసుకున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపిడిఒ భరోసా ఇచ్చారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు సిద్ధం కావాలి

### బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షుడు పిలుపు

**ప్రజాపక్షం/రామాయంపేట :** ప్రజా సమస్యల పరిష్కారానికై పార్టీ శ్రేణులు సిద్దం కావాలని బిజెపి పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సోమవారం రామాయంపేట పట్టణ బిజెపి కార్యనిర్వాహక సభ్యుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ రామాయంపేటను గత ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ ప్రకటించినప్పటికి గెజిట్ విడుదల కాకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి డివిజన్ గెజిట్ నోటిఫికేషన్ తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతి బూత్ స్థాయిలో విజయవంతంగా నిర్వహించి ఒక్క ఓటు కూడా పోకుండా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రామాయంపేట పట్టణంలో నెలకొన్న సమస్యలను ప్రజల పక్షాన నిలబడి పరిష్కారానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మున్సిపల్‌లో అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకొని నిదులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములుతో పాటు తదితరులు ఉన్నారు.

## దుబ్బాక కోర్టు హాల్లో నాగుపాము కలకలం



**ప్రజాపక్షం/దుబ్బాక :** దుబ్బాక కోర్టు హాల్లో సోమవారం నాగుపాము ప్రత్యక్షమవడంతో తీవ్ర కలకలం రేగింది. మధ్యాహ్నం ట్రయల్ కేసుల విచారణలు కొనసాగుతున్న సమయంలో నాగుపాము కోర్టు హాల్లోకి చొరబడటంతో న్యాయమూర్తి, న్యాయవాదులు, సిబ్బంది ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన సిబ్బంది. అక్కడున్న వారి సహాయంతో పామును అదుపులోకి తీసుకున్నారు. ఏ మాత్రం ఆలస్యమైన ఎవరినైనా కాటు వేసే ప్రమాదం ఉండేదని అక్కడున్న వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటన అనంతరం కోర్టు భవనం పరిసరాల్లో గడ్డి, చెత్త తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని అధికారులు,సిబ్బంది నిర్ణయించారు. దీంతో కోర్టు ప్రాంగణంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



## పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు

**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** భారతీయ జనతా పార్టీ సిద్ధిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమకమైన సందర్భంగా నత్తి మల్లేష్ ముదిరాజ్ సోమవారం మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్టాస్ మల్లేష్ గౌడ్ ని నర్సాపూర్ లో వారి నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీలో కష్టపడిన వారిని పార్టీ పెద్దలు గుర్తిస్తారని, తప్పకుండా సముచిత స్థానం లభిస్తుందని అన్నారు. జిల్లాల లో పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యకర్తల సంఖ్య పెంచేలా సమావేశాలకు, కార్యకర్తలను హాజరయ్యేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు నరేందర్ చారి, మనోహరాబాద్ మండల అధ్యక్షుడు బక్క వెంకటేష్ గౌడ్, బూత్ అధ్యక్షులు ఎర్ర శేఖర్, ఎల్.శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.



## పామ్ ఆయిల్ సాగుతో అధిక లాభాలు

**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** పామ్ ఆయిల్ మొక్కల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి అన్నారు. మండల పరిధిలోని సీతానగర్ గ్రామంలో రైతు లింగయొల్ల లక్ష్మీ నర్సింలు వ్యవసాయ క్షేత్రంలో పామాయిల్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పామ్ ఆయిల్ మొక్కలను పెంచడానికి రైతులకు అధిక సబ్సిడీలు ఇస్తుందని ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నవీన్ కుమార్, ఫీల్డ్ సూపర్వైజర్లు జాన్సన్, నజీర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి

### ఎంపిడిఒ శ్రీనివాస్

**ప్రజాపక్షం/రేగోడ్ :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ప్రజలు సమస్యలను దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరిస్తామని అన్నారు రేగోడ్ మండలంలో మొదటి విడత కింద 364 ఇండ్ల మజూరు జరిగియాని అందులో 105 ఇండ్ల పూర్తి చేయడం జరిగిందని అన్నారు ఇప్పటేకే గజవాడ ఆర్ ఇటిక్యాల గ్రామాల్లో భవనాలు పూర్తయినాయని అన్నారు పంచాయతి భవానాలు గజవాడ మక్త వెంకటాపురం లో పూర్తయిందని పెద్ద తాండా సంగమేశ్వర్ తాండాలలో నిర్మాణాలు భవనాలకు పనులు వేగవంతంగా పూర్తి చేసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో మండల సూపర్టెంట్ రమేష్ కేశయ్య తదితరులు ఉన్నారు

# రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు పెట్టాలి

### ప్రతి పాఠశాలలో కామన్ డైట్ పాటించాలి

### జిల్లా కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/కొండపాక :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో కామన్ డైట్ మెనూ పాటిస్తూ రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు పెట్టాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కొండపాక మండలం దుద్దెడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్నం భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆలు గడ్డ టమాట వంకాయ కూర, వెజిటేబుల్ బిర్యాని, గుడ్డులను పరిశీలిస్తూ వెజిటేబుల్ బిర్యాని నాణ్యత తనికి చేశారు. రోజు వారిగా విద్యార్థుల హాజరు ప్రకారం కూరగాయలు, వంట సరుకులు కొలత ప్రకారం తీసుకోవాలని, మధ్యాహ్నం భోజన ప్రక్రియను ప్రిన్సిపల్ లేదా ఒక ఉపాధ్యాయులు పర్యవేక్షణ చెయ్యాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాఠశాల ప్రాంగణం మొత్తం పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎక్కడ కూడా నీటి నిలువలు ఉండకుండా, దోమలు ఈగలు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలని ప్రిన్సిపల్ ఉపాధ్యాయులను ఆదేశించారు. కిచెన్ గార్డెన్ ను పరిశీలిస్తూ ఇంకా రకరకాల ఆకుకూరలు, పెట్టాలని రోజు వంటలో ఆకుకూరలు వాడేలా కిచెన్ గార్డెన్ ను అభివృద్ధి చెయ్యాలని ఆదేశించారు.

### కొండపాక మండలంలోనే

# యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు చేయాలి

### అఖిలపక్ష సమావేశంలో పలువురి డిమాండ్




**ప్రజాపక్షం/కొండపాక :** కొండపాక మండలానికి మంజూరైన యంగ్ ఇండియా స్కూల్‌ను కొండపాకంలోని ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద అఖిలపక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మండలానికి మంజూరైన స్కూలు మండలంలోని ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అన్ని గ్రామాల ప్రజలు, యువత, ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొని కొండపాక మండలానికి మంజూరైన యంగ్ ఇండియా స్కూల్‌ను మన మండలంలోనే ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం జిల్లా గౌరవ కలెక్టర్ హైమావతికి వినతిపత్రం సమర్పించి కొండపాక మండలానికి మంజూరైన ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థను ఇతర ప్రాంతానికి తరలించకుండా కొండపాక మండలంలోనే నిర్మించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# పచ్చని పొలాల్లో ఇథనాల్ చిచ్చు

### ఫ్యాక్టరీని మూసి వేయాలని మండల ప్రజల డిమాండ్

### తహసీల్దార్ కార్యాలయం ముందు అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన

**ప్రజాపక్షం/బెజ్జంకి :** మండల పరిధిలోని గుగ్గిళ్ళ, పోతారం గ్రామాల శివారుల్లో నిర్మించిన ఇథనాల్ ఫ్యాక్టరీని తక్షనమే మూసి వేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.అనంతరం అఖిలపక్ష నాయకులతో కలిసి మాజీ ఎంఎల్ఏ రసమయి బాలకిషన్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఇథనాల్ యాజమాన్యం దొడ్డిదారిన ఫ్యాక్టరీ నిర్మాణానికి అనుమతులు పొందారని అన్నారు. ఫ్యాక్టరీ ప్రారంభం నుండి గ్రామాల్లోకి తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతుందని అందుకు ప్రజలు రోగాల బారిన పడే ఆస్కారం ఉందని అన్నారు. అంతే కాకుండా ఫ్యాక్టరీలో నుండి వేలువడే విష వాయువులు నీటిలో కలువడంతో చేపలు మృతి చెందాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ మూసివేయకుండా ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో వాతావరణం కాలుష్యమై విషమించి ప్రాణ నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇథనాల్ ఫ్యాక్టరీని మూసి వేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్‌కు అఖిలపక్షం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి,సిపిఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్,ఎమ్మార్పీస్ మండలాధ్యక్షులు వడ్లూరి పర్శరాములు,సీనియర్ నాయకులు చింతకింది పర్శరాములు, దూమాల మహేష్,శ్రీనివాస్ రావు,బోర్ర సురేష్ కుమార్,లింగాల లక్ష్మణ్,కనగండ్ల తిరుపతి, బొమ్మిడి సాయికృష్ణ,ఎల శేఖర్ బాబు,కొర్వి తిరుపతి, అఖిల పక్షనాయకలు బీఆర్ఎస్,సిపిఎం, ఎమ్మార్పీస్, బిఎస్పీ, స్వేరో నాయకులు, మత్స్యకారులు, రైతులు, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అల్లాదుర్గంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

### 90 మాత్రల పంపిణీ : మండల వైద్యాధికారి సారిక



**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం లో భాగంగా సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సారిక ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాలలో 35 అంగన్వాడి సెంటర్లు 25 ప్రభుత్వ పాఠశాలలు మూడు ప్రైవేటు పాఠశాలలు జూనియర్ కాలేజ్ విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులు పంపించేశారు. మొత్తం 2563 మంది విద్యార్థులకు గాను 2310 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 90 శాతం పంపిణీ చేసినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళ వేధింపుల కేసులో నిందితుడికి రెండేళ్ల జైలుశిక్ష

**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** 13 ఏళ్ల కిందట 2013లో మహిళను వేధింపు కేసులో నిందితుడు ధారావత్ దీప్లా నాయక్‌కు చేర్యాల జ్యుడిషియల్ ఫస్ట్ మేజిస్ట్రేట్ బానోత్ శ్రీరామ్ రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటుగా 1500 వందల రూపాయల జరిమాన విధించారు. సిద్దిపేట జిల్లా మద్దూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధూల్మిట్ట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన నిందితుడు ధారావత్ దీప్లా నాయక్ ఓ మహిళను అసభ్యకరంగా వేధించిన కేసులో ఐపిసి 354(డి), 509 మరియు 506 సెక్షన్ల కింద నమోదైన కేసులో 13 సంవత్సరాలు పూర్తి విచారణ అనంతరం నిందితుడు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటుగా 1500 వందల రూపాయల జరిమానను కోర్టు విధించినట్లు మద్దూరు ఎస్ఐ ఆసిఫ్ ప్రెస్‌నోట్ ద్వార తెలిపారు. ప్రభుత్వ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎల్. తిరుపతి, వాదనలు వినిపించగా, దర్యాప్తు అధికారులు, మద్దూరు పోలీసులు, కోర్టు లైజనింగ్ సిబ్బంది సమన్వయంతో నిందితుడికి శిక్ష పడింది. మహిళల పట్ల, మైనర్ బాలలు, బాలికలపై నేరాలకు పాల్పడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని మద్దూరు పోలీసులు హెచ్చరించారు. ఇటువంటి ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు ఎస్ఐ ఆసిఫ్ విజ్ఞప్తి చేశారు. మైనర్ల భద్రతవిషయంలో రాజీ లేదని ఎస్ఐ స్పష్టం చేశారు. ఇలింటి వాటిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.



## మర్పడగ క్షేత్రంలో ఘనంగా ఆర్ద్రా మహోత్సవం

**ప్రజాపక్షం/కొండపాక :** కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామిక్షేత్రంలో సోమవారం న ఆర్ద్రామహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం 630 గంటలకు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్వస్తివాచనం అనంతరం నవగ్రహ, దిక్పాలక, రుద్ర కలశ స్థాపన స్థాపిత దేవతా పూజ నిర్వహించారు. సంతాన మల్లికార్జున స్వామికి లఘున్యాస పూర్వకంగా సంతాన పాశుపత అభిషేకం, వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్య స్వామికి విశేష పంచామృత ఫల రస అభిషేకం నిర్వహించారు. తర్వాత స్థాపిత దేవతా హవనం, సంతాన పాశుపత హవనం, మహాపూర్ణాహుతి వైభవోపేతంగా జరిగాయి. విజయదుర్గామాతకు విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సిద్ధిపేట శరభేశ్వరాలయ అర్చకులు కొరిడేకృష్ణమూర్తి, హైమవతి దంపతులకు దంపతీ పూజ నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు అయితా బాలరాజేశం, ఎల్. రామచంద్రం, సురేందర్ రెడ్డి, శ్రీశైలం, గట్టు విఠల్, మర్యాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశంలో అద్భుతం అతి పెద్ద నక్షత్రం



**ప్రజాపక్షం/రేగోడ్ :** మండల కేంద్రంలోని ఆకాశంలో సోమవారం రాత్రి అద్భుతం జరిగింది రాత్రి 7:30 గంటలకు అతి పెద్ద నక్షత్రం దర్శనమిచ్చింది. సాధారణ నక్షత్రాల కంటే మూడింతలు పెద్దగా ఉన్నట్లు పలువురు తెలిపారు ఆకాశంలో ఒకే నక్షత్రం పెద్దగా కనిపించడంతో ప్రజలు ఆసక్తిగా చూశారు

## ఆరుద్ర నక్షత్ర శివార్చనలో డీసీపీ

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** పట్టణంలోని గుండ్ల గడ్డ శ్రీ ఉమామహేశ్వర దేవాలయంలో సోమ వారం ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి, చతుర్దశి ఒకే రోజున కలిసి వచ్చిన విశిష్టత సందర్భంగా శివపార్వతులకు ప్రత్యేక పూజలు, శివలింగానికి మహాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆలయానికి విచ్చేసి శివలింగానికి అభిషేకం నిర్వ హించి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ కార్య క్రమంలో భక్తులు కిరణ్, అరుణ్, ఆంజనేయులు, శ్రీకాంత్, వినయ్, మాధవి, రాణి, తదితరులు పాల్గొన్నారు

## అర్హులైన ఏ ఒక్క ఓటరుకు కూడా అన్యాయం జరుగొద్దు

**ప్రజాపక్షం/కొడకండ్ల:** ప్రత్యేక ఓటరు జాబితా సవ రణ కార్యక్రమంలో అర్హులైన ఒక్క ఓటరుకు కూడా అన్యాయం జరుగకుండా బీఎల్ఓలు బాధ్యత వహించాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్ఐఆర్ ప్రోగ్రాం బీఎల్ఏ ఇంచార్జి దరావత్ సురేష్ నాయక్ కోరారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామా లలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 70శాతం పూర్తవడం అభినందనీయమని, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా నూరు శాతం కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొడకండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్‌గౌడ్‌తో పాటు జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

**ప్రజాపక్షం/జఫర్‌గఢ్:** మండలంలోని తమ్మడ పల్లి జి గ్రామంలో ప్రైమరీ స్కూల్, హైస్కూల్లో కూరపాటి రాజయ్య కుమారుడు రిటైర్డ్ ప్రిన్సిపల్ కూరపాటి నాగేశ్వర రావు తన స్వగ్రామంలో చదువుకుని ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయునిగా ఉద్యోగం సంపాదించి రిటైర్డ్ అయినా తన గ్రామంలో ప్రభుత్వ పాఠశా లలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు 350 నోట్ పుస్తకాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కృష్ణమూర్తి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ ప్రభాకర్, భిక్షపతి, రాజేంద్రన్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

## పరామర్శించిన సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్

**ప్రజాపక్షం/కొడకండ్ల:** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త మొకిరాల వెంకన్న తండ్రి సాగర్ అనారోగ్యంతో మృతిచెందగా కొడ కండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సి రాజేందర్ రెడ్డి ఆదేశానుసారం వారి ఇంటికి వెళ్లి భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మనోధైర్యం కల్పించి వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భిక్షపతి, మార్కెట్ డైరెక్టర్ వెంకన్న, నాయకులు మల్లేష్, ఎల్లయ్య, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే రైతాంగ సమస్యలు పరిష్కారం

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను లిఫ్టింగ్ చేసి జనగామ జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను తక్షణమే నింపి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందు నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జులై 15, 16వ తేదీలలో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయితి కార్యాలయాల ఎదుట తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే రైతాంగ నిరసన కార్యక్ర మాలను విజయవంతం చేయాలని రైతులు, ప్రజ లకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిరసన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్ శిక్షణ కార్యక్రమం విజయవంతం



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులు ,శారీరక విద్య ఉపాధ్యాయులు, కోచ్‌లలో ఆధునిక క్రీడా నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రతి ష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న'' స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్ ''శిక్షణ కార్యక్రమం సోమవారం అందోల్ జోగిపేట లోని ఎన్టీఆర్ స్టేడియంలో విజయవంతంగా నిర్వ హించారు. రాష్ట్ర వ్యాప్తంగా జులై 10 నుంచి 14 వరకు అన్ని జిల్లాలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన శిక్షణలో క్రీడా సంఘాల ప్రతినిధులు, ఫిజికల్ డైరెక్టర్లు ,ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు ,సీనియర్ క్రీడాకారులు ,యువ క్రీడాకారులు, క్రీడాభిమానులు ఉత్సాహంగా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధి కార సంస్థకు చెందిన ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఫజిల్ సీని యర్ కోచ్‌లు, ఫణీంద్ర రాజేశ్ రుపేందర్, కుమార్‌లు ఆధునిక శిక్షణ పద్ధతులు వార్మప్ ప్రాముఖ్యత క్రీడల్లో గాయాల నివారణ శారీరక దృఢత్వం పిటినెస్ నిర్వ హణ నైపుణ్యాభివృద్ధి క్రీడల్లో పాటించాల్సిన మెళుకువ లపై సమగ్ర అవగాహన కల్పించారు. శాస్త్రీయ శిక్షణ విధానాలను అనుసరించడం ద్వారా క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరచగలరని వివరించారు. కార్య క్రమంలో మండల విద్యాధికారి కృష్ణ ప్రధానోపాధ్యా యులు నరేష్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ తో పాటు పలు వురు క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా యువజన ,క్రీడల శాఖ అధికారి కె. ధనంజనేయులు మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న ఆధు నిక క్రీడా నైపుణ్యాలు వార్మప్ విధానాలు, శాస్త్రీయ శిక్షణ పద్ధతులను ప్రతి పీడి పీఈటీ తమ తమ విద్యా సంస్థల్లో శిక్షణ కేంద్రాల్లో క్రీడాకారులకు అందించి వారి ప్రతిభను మరింత మెరుగుపర్చేందుకు కృషి చేయాలని సూచించారు.

## వైభవంగా కొడవటూర్ సిద్దేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొడవటూర్ శ్రీసిద్దేశ్వర స్వామి దేవాల యంలో సోమవారం గిరి ప్రదక్షిణ మహోత్సవం భక్తుల జయజయధ్వానాల మధ్య అత్యంత వైభవంగా జరి గింది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన భక్తులతో కలిసి గిరి ప్రదక్షిణలో పాల్గొని ఆధ్యాత్మిక ఉత్తేజాన్ని నింపారు. అనంతరం బీర్ల ఐలయ్య మాట్లాడుతూ కొడవటూర్ సిద్దేశ్వర స్వామి క్షేత్రం ఎంతో మహిమాన్వితమైనదని కొనియా డారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాల సమగ్ర అభివృద్ధి తోపాటు మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కవిత మురళి, ప్రధాన అర్చకులు ఓం నమశి వాయ, గుట్ట చైర్మన్ వెంకట్ రెడ్డి, పాల్గొన్నారు.

## భూభారతి విజయవంతానికి లైసెన్స్ సర్వేయర్ల పాత్ర కీలకం

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన భూ భారతి కార్యక్రమాన్ని విజయ వంతం చేయడంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమ వారం ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాలులో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ ఆధ్వర్యంలో లైసెన్స్‌డ్ సర్వే యర్లకు రీసర్వే కార్యక్రమంపై ప్రత్యేక సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ లైసెన్స్ సర్వేయర్ల తప్పక రీ సర్వేలో పాల్గొనా లని సూచించారు. ఈ నెల 20వ తేదీలోగా విధులకు హాజరు కావాలని ఆదేశించారు. శాస్త్రీయంగా సర్వే నిర్వహించడం ద్వారా ప్రజలకు, ముఖ్యంగా రైతులకు ఎంతో న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యల పరిష్కారానికి ఇదొక గొప్ప అవకాశమని, సర్వేయర్లు అందరూ తప్పకుండా ఈ రీ సర్వేలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో మొత్తం 91 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఉన్నా రని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వారంతా రీసర్వే విధుల్లో చేరాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 20వ తేదీ లోపు విధులకు హాజరుకాని సర్వేయర్ల లైసెన్సులను రద్దు చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమికంగా 7 గ్రామాలలో ఈ రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉందని కలెక్టర్ వెల్ల డించారు. దశాబ్దాలుగా పెండింగ్ ఉన్న రైతుల భూ సమస్యలను పరిష్కరించడంలో సర్వేయర్ల పాత్ర ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని, ఈ బాధ్యతగా గుర్తించి సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఈ సమా వేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, జిల్లాలోని లైసె న్స్‌డ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## సర్ ఓటర్ జాబితాను పరిశీలించిన ఆర్డీఓ రమేష్ బాబు



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మ కంగా నిర్వహిస్తున్న సర్ ఓటర్ జాబితా సవరణ లో భాగంగా సోమవారం ఆందోల్ ఆర్డీఓ రమేష్ బాబు అప్పాజీపల్లి గ్రామంలో సర్ ఓటర్ జాబితా ఫారాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, మండలం లోని ఆయా గ్రామాలలో ప్రజలు సర్ ప్రక్రియలో పాల్గొని ఫారాలు నింపి ఆన్లైన్ అప్లోడ్ చేసే విధంగా అవగాహన పెంచాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి ఒక్కరూ సర్ ప్రక్రియలో పాల్గొని తమ ఓటు హక్కును పొందాలని ప్రజలకు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ మల్లయ్య, ఆర్ఐ స్వర్ణలత, గ్రామ సర్పంచ్ గందలి రవి కుమార్, బిఎల్ఓ మంజుల యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపులు

### ఐక్యంగా ముందుకు సాగాలి

**ప్రజాపక్షం/శివ్వంపేట:** మున్నూరు కాపులు ఐక్యంగా, సంఘటితంగా ముందుకు సాగాలని రాష్ట్ర మున్నూరు కాపు ఉపాధ్యక్షులు కల్లూరి హనుమంతరావు అన్నారు. సోమవారం మర్యాద పూర్వకంగా రాష్ట్ర మున్నూరు కాపు అధ్యక్షులు పుట్టం పురుషోత్తంరావును కలిశారు. ఈ సంద ర్భంగా రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఆకుల సత్యనారాయణ , మహిళా పరస్పర సహకార సంఘం వైస్ చైర్‌పర్సన్, మాజీ సర్పంచ్ కల్లూరి కీర్తన తదితరులు ఉన్నారు.



## ప్రతి ఒక్కరు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** ప్రతి ఒక్కరు తమ పేర్లను ఓటరు జాబి తాలో నమోదు చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కదకంచి బాల మణి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 12, 21, 22, 29వ వార్డులలో ప్రత్యేక సవరణ ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నాలుగు వార్డులలోని ఓటర్ల జాబితాను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఓటరు జాబితాలో ఉన్న పొరపాట్లను సరిచేసుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

## కాంగ్రెస్ గ్రామ శాఖల నూతన కమిటీల ప్రకటన

**ప్రజా పక్షం/ వేములవాడ:** వేములవాడ అర్బన్ మండలంలోని 11 గ్రామాలకు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులను నియమించినట్లు మండల అధ్యక్షుడు వంగ పరశురాం గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు నిరంతరం కృషి చేయాలని ఆయన కోరారు.గ్రామాల వారిగా నియమితులైన వారి వివరాలు. చంద్రగిరి గ్రామ అధ్యక్షుడిగా ఎస్.కె ఇమామ్, చీర్లవంచకు కుర్మ రవి, గుర్రం వానిపల్లికి తడుకమడ్ల మధుకర్ రెడ్డి, మారుపాకకు ముధాం శ్రీకాంత్, చింతలఠాణాకు గుర్రం మధుసూదన్, శభాష్ పల్లికి కొమ్మునబోయిన అభిమన్యు ఎంపికయ్యారు. అలాగే కొదుముంజ గ్రామ శాఖ అధ్యక్షుడిగా పొన్నం ప్రశాంత్, అనుపురానికి తంబాల శేఖర్, రుద్రవరానికి కత్తి కనకయ్య, సంకెపల్లికి ఎల్లా నరేష్, ఆరెపల్లి గ్రామ అధ్యక్షుడిగా చిలువేరి మల్లేశం నియమితులయ్యారు. ఈ నూతన కమిటీలు పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి చురుగ్గా పనిచేయాలని మండల కాంగ్రెస్ నాయకత్వం కోరారు.

## ఆల్ఫోర్స్ కళాశాలలో నులి పురుగు నివారణ మాత్రల పంపిణీ

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** ఆరోగ్యకరమైన జీవితాన్ని ప్రతి ఒక్కరూ అనుభవించాలని తద్వారా ఉత్తమమైన జీవితాన్ని గడపగలు గుతామని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి అ న్నారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ సందర్భంగా ఏర్పాటు చేసి న అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడా రు. ప్రతి ఒక్కరూ నులి పురుగుల నివారణ మాత్రలు తీసుకోవాలని సంవత్సరానికి రెండుసార్లు ఈ మాత్రలు వేసుకోవడం వల్ల నులి పురుగులు శరీరంలో తొలగిపోయి శరీరం హుషారుగా ఉంటుందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో ఈ మాత్రలు వేయడం జరుగుతుందని ఈ మాత్రలు తీసుకోకపోవడం వల్ల పెరుగుదల ఆగిపోతుందని అన్నారు. 1 నుంచి 19 సంవత్సరాలు పిల్లలు ఈ మాత్రలు తీసుకోవచ్చని ప్రభుత్వాలు చెబుతున్నాయని తెలిపారు.

## శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్

**ప్రజా పక్షం/ వేములవాడ :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయా నికి విచ్చేసిన ఆది శ్రీనివాస్ కు ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛార ణలతో, స్వస్తివాచనంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యేకు ఆలయ మండపంలో అర్చకులు తీర్థప్రసాదం అందజేసి వేదాశీర్వ చనం చేశారు.

## నేడు పత్తి మార్కెట్ యార్డుకు సెలవు

**ప్రజాపక్షం/జమ్మికుంట:** అమావాస్య సందర్భంగా జమ్మికుంట పత్తి మార్కెట్ యార్డుకు మంగళవారం సెలవు ప్రకటించినట్లు మా ర్కెట్ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం తెలిపారు. మార్కెట్ యార్డు బుధవారం యథావిధిగా ప్రారంభం అవుతుందని కావున పై విష యాన్ని రైతులు గమనించి తమ వ్యవసాయ ఉత్పత్తులను పైన తెలి పిన సెలవు రోజు తమ సరుకులను మార్కెట్ యార్డుకు తీసుకురావొ ద్దని కోరారు. ఈ విషయంలో రైతులు సహకరించి ఇబ్బందులు ఎదు ర్కోవద్దని పేర్కొన్నారు.

# బిజెపి శ్రేణులకు అండగా ఉంటా.. ఎంపి వైఖరితోనే రాజీనామా

**ఎపి ధర్మపురి అరవింద్‌పై తీవ్ర విమర్శలు చేసిన డా. రఘు, సుఖేందర్ గౌడ్**

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణ బిజెపిలో అసంతృప్తి జ్వాలలు ముదిరాయి. ఇటీవల పార్టీకి రాజీనామా చేసిన బిజెపి మాజీ సీనియర్ నాయకుడు డా. రఘు చిట్నేని సోమవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇదే సందర్భంగా ఆయన బాటలోనే మెట్‌పల్లి మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ చర్లపల్లి మీన సుఖేందర్ గౌడ్ కూడా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా డా. రఘు చిట్నేని మాట్లాడుతూ, తాను భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేసినప్పటికీ బిజెపి కార్యకర్తలతో తన అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందన్నారు. పార్టీ మారినంత మాత్రాన కార్యకర్తలకు దూరం కాలేదని, వారికి ఎలాంటి అవసరం వచ్చినా, ఎలాంటి కష్టం ఎదురైనా తనను నిర్భయంగా సంప్రదించవచ్చని, ఎప్పటిలాగే వారికి అండగా ఉంటానని తెలిపారు.

**స్వలాభం కోసమే కార్యకర్తలను వాడుకుంటున్నారు:** పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ వైఖరిపైనే తాను పార్టీకి రాజీనామా చేయాల్సి వచ్చిందని డా. రఘు చిట్నేని ఆరోపించారు. ఎంపీ తన వ్యక్తిగత ప్రయోజనాల కోసమే పార్టీని, రాత్రింబవళ్లు శ్రమించే కార్యకర్తలను ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తల కృషికి తగిన గుర్తింపు, గౌరవం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఎంపిపై మాజీ కౌన్సిలర్ సుఖేందర్ గౌడ్ విమర్శలు :** రాజీనామా అనంతరం కౌన్సిలర్ చర్లపల్లి మీన సుఖేందర్ గౌడ్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల సమయంలో ఎంపీ ధర్మపురి అరవింద్ మెట్‌పల్లి మీదుగా కోరుట్ల, జగిత్యాల, రాయికల్ ప్రాంతాలకు వెళ్లినప్పటికీ, ఒక్కరోజు కూడా మెట్‌పల్లి పట్టణంలో పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించలేదని ఆరోపించారు.స్థానిక మున్సిపాలిటీని, ఇక్కడి నాయకులను పూర్తిగా విస్మరించారని ఆయన విమర్శించారు. ఎంపీ అరవింద్‌బిజెపిలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ నాయకుల మాదిరిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలను పక్కనపెట్టి, వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తుండడం వల్లే తాము పార్టీని వీడాల్సి వచ్చిందని డా. రఘు చిట్నేని,చర్లపల్లి మీన సుఖేందర్ గౌడ్ పేర్కొన్నారు.



## కేటాయింపులు రిజిస్ట్రేషన్ చేయొద్దని వినతి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** రాఘవపేట నడికుడ గ్రామాల మధ్య పశువుల మేత కోసం కేటాయించిన భూమిని ఎవరికి రిజిస్ట్రేషన్ చేయొద్దని రాఘవపేట గ్రామస్తులు తాసిల్దార్ రామచందర్ ను సోమవారం కోరారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాఘవపేట గ్రామాన్ని అనుకున్న పునరావాస గ్రామమైన నడికుడకు భూ కేటాయింపు చేసినప్పుడు రెండు గ్రామాల మధ్యలో పశువుల మేత కోసం ఎల్లమ్మ గుట్ట, మల్లన్న గుట్ట ,గుడ్డేనువుల గుట్ట, చెరువు మీది గుట్ట ,ప్రాంతంలో సుమారు 150 ఎకరాల భూమి ఉండేదని అట్టి భూమిని రిజిస్ట్రేషన్లు గానీ, ఇతర అవసరాలకు కేటాయింపు చేయకుండా చూడాలని తాసిల్దారు రామచందర్ కు రాఘవపేట సర్పంచ్ తోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామస్తులు విన్నవించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్,గ్రామ పెద్ద మనుషులు దండ్ల పోచమ్మ,నవీన్,సాయికుమార్,తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ

**ప్రజాపక్షం/రాయికల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాయికల్ మండలం ఒడ్డెర కాలనీ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బోదాసు చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోదాసు రాజేష్, కార్యదర్శి మమ్మద్ అమీర్, ఉపాధ్యాయులు మోహన్, నవ్యశ్రీ, అంగన్వాడీ టీచర్ బియ్యని సుజాత,ఆశ వర్కర్ సుమలత,కారోబార్ జలంధర్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జి.ఎం సేఫ్టీ సందర్శన

**ప్రజాపక్షం/రామగిరి:** సింగరేణి రామగుండం రీజియన్ సేఫ్టీ విభాగం జనరల్ మేనేజర్ యం.మల్లయ్య సోమవారం రామగుండం3 ఏరియాను సందర్శించారు. రామగుండం రీజియన్ సేఫ్టీ విభాగం జనరల్ మేనేజర్ ఏరియా ను సందర్శించిన సందర్భంగా జి.యం.కార్యాలయం నందు రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ వారిని శాలువాతో సత్కరించి, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో ఎస్వోటు జియయం.రామ్మోహన్, ఏరియా ఇంజినీర్ దూప్ సింగ్, ఏరియా సర్వే అధికారి అఫ్సర్ పాషా, మేనేజర్ పి.శరవణన్, సీనియర్ పి.ఓ రాజేశం,తదితరులు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ,జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి తో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.అంతర్గం మండలం గోలివాడ గ్రామానికి చెందిన కాంపల్లి పద్మ తమకు గ్రామ శివారు సర్వేనెంబర్ 243 లో రెండు ఎకరాల ఒక్క గుంట భూమి ఉందని, తన భర్త మరణం అనంతరం ఆ భూమి తన పేరున విరాసిక్ పట్టా మార్పిడి జరిగిందని, ఈ భూమి ఆన్లైన్లో నమోదు చేసి పట్టా దార్ పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.రామగుండం నగరం లక్ష్మీ పురం కు చెందిన మినుగు పృధ్వీరాజ్ మున్సిపల్ అధికారులు అక్రమంగా తాము ఉంటున్న ఇండ్లని కూల్చే వేశారని దీనిపై సమగ్ర విచారణ జరిపి తమ కు న్యాయం చేయాల్సిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకోగా మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ధర్మారం మండలానికి చెందిన నూనె వెంకట నర్సయ్య తనకు బొమ్మ రెడ్డి గ్రామ శివారులో సర్వేనెంబర్ 168/1 లో 2 ఎకరాల 30 గుంటల భూమి ఉందని , తన భూముల కనిలను కొందరు తొలగించి తన భూమికి వెళ్ల కుండా అడ్డుకుంటున్నారని చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## పంటలపై ఎల్‌నినో ప్రభావం

**సాగులో రైతులు తగు జాగ్రత్తలు**

**జిల్లా సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ చంద్ర**

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎల్నినో ప్రభావం వల్ల సాధారణం కంటే వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. పెద్దపల్లి జిల్లాలో సాధారణ వర్షపాతం (237.4 మి.మీ) తో పోలిస్తే, ప్రస్తుతం 13 శాతం లోటుతో (206.6 మి.మీ) వర్షపాతం నమోదైనట్లు పంటల సాగులో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి. సతీష్ చంద్ర సోమవారం ఒక ప్రకటనలో రైతులకు సూచించారు.జిల్లాలో ఇప్పటికే 2 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. ఇంకా నాట్లు వేయని రైతులు స్వల్పకాలిక (120 రోజులు) రకాలను ఎంచుకుని, జూలై 15 లోపు నాట్లు పూర్తి చేసుకోవాలని, జూలై 15 తర్వాత నాట్లు వేసే రైతులు తెలంగాణ సోనా( ఆర్ఎన్ఆర్ ) 15048 రకాన్ని నాటుకోవాలని తెలిపారు.పత్తి రైతులు జూలై 20 లోపు విత్తన ప్రక్రియను పూర్తి చేయాలి. మట్టిలో తేమను బట్టి విత్తనం వేయాలి. పత్తిలో బోర్డర్, ఇతర పంటలను అంతర పంటలుగా సాగు చేయడం ద్వారా అదనపు ప్రయోజనం ఉంటుందని అన్నారు.మొక్కజొన్న 90100 రోజుల స్వల్పకాలిక లేదా 100110 రోజుల మధ్యకాలిక రకాలు అనుకూలం జూలై 16 నుండి 31 మధ్య నాట్లు పూర్తి చేయాలని ,ఇతర పంటలు తక్కువ వర్షపాతానికి అనువైన కంది, పెసర, మినుము, అలసందలు (జొన్నలు, సజ్జలు) వంటి పంటలను ఎంచుకోవాలని, స్వల్పకాలిక పంటలను సాగు చేయడం ద్వారా నీటి ఎద్దడిని తట్టుకోవచ్చు,ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సరైన ప్రణాళికతో పంటలు సాగు చేసి, సాగులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు వహించాలని డాక్టర్ బి. సతీష్ చంద్ర కోరారు.

## ఉద్యోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** విద్యుత్ రంగంలో పనిచేసే ప్రతి ఉద్యోగి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని భద్రత పరికరాలను తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఎన్ పీ డీ సీ ఎల్ డీ ఈ అండ్ భద్రత అధికారి (సేఫ్టీ ఆఫీసర్ ) కె. గంగారాం ఆదేశించారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని గొల్లపల్లి సెక్షన్ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్లలో పనిచేస్తున్న వారికి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయంలో సోమవారం జగిత్యాల డీఈ అండ్ సేఫ్టీ ఆఫీసర్ కె. గంగారాం భద్రతా సమీక్ష సమావేశం నిర్వహించారు.విద్యుత్ సబ్ స్టేషన్లలో పనిచేస్తున్న వారికి రక్షణ కిట్ లను వినియోగించడం వలన జరిగే లాభ నష్టాలపై అవగాహన కల్పించారు.విద్యుత్ భద్రత,వినియోగదారుల సేవలు ,వ్యవస్థ మెరుగుదలపై సిబ్బందితో పాటు అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి భద్రతపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా సేఫ్టీ పెప్ టాక్ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యుత్ పనుల నిర్వహణలో ప్రతి ఉద్యోగి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందితోపాటు అధికారులు హెల్మెట్,హ్యాండ్ గ్లౌజ్, ఎర్త్ రాడ్ వంటి భద్రత పరికరాలు తప్పనిసరిగా ధరించాలి .అవి లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు చేయరాదని సూచించారు .ప్రాణం అమూల్యమైంది ప్రతి ఉద్యోగి తన ప్రాణానికి, తన కుటుంబానికి ఉన్న విలువను గుర్తుంచుకొని అత్యంత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.జిల్లాలో జీరో ప్రమాదాలు సాధించే లక్ష్యంతో అందరూ సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సెక్షన్ పరిధిలోని అన్ని ముఖ్యమైన పనితీరు సూచికలు (పారామీటర్లు) ప్రస్తుతం కొనసాగుతున్న పనుల పురోగతిని సమీక్షించి శాఖ నిర్దేశించిన భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. జెన్‌కో వైటీపీఎస్ పవర్ ప్లాంట్‌లోని సి హెచ్ పి అండ్ ఏ హెచ్ పి యూనిట్లను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.ఈ సమావేశంలో ఏడీఈ పి.వరుణ్ కుమార్,ఏఈ కె. రాకేష్ కుమార్, గొల్లపల్లి,చిల్వా కోడూర్ సెక్షన్ల సబ్ ఇంజనీర్లు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థలు, ఆసుపత్రుల అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి : కలెక్టర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** జిల్లాలో చేపట్టిన విద్యాసంస్థలు, ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలో కొనసాగుతున్న విద్యాసంస్థలు, ఆసుపత్రుల అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన ప్రతి అభివృద్ధి పనిని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. మంథని 50 పడకల ఆసుపత్రి, గుంజపొడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రామగుండం నర్సింగ్ కళాశాల, వైద్య కళాశాల హాస్టల్, పెద్దపల్లి 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పనులు పూర్తయితే జిల్లాలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనులు, పీఎం శ్రీ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులు,అదనపు తరగతి గదుల నిర్మాణాలు, ఇతర మౌలిక వసతుల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో టీఎస్ఎంఐడీసీ ఈఈ విశ్వప్రసాద్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన, ఏఈతో పాటు సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సఫాయి కార్మికులను పర్మినెంట్ చేయాలని మంత్రికి వినతి

**ప్రజాపక్షం/రాయికల్ :** రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సఫాయి కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ జగిత్యాల జిల్లా మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు వినతిపత్రం ఆదివారం అందజేశారు. ఏళ్ల తరబడి తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషిస్తున్న సఫాయి కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొల్లె చిన్నయ్య కోరారు.ఈ అంశంపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్

**ప్రజాపక్షం/పెగడపల్లి :** మండలంలోని బతికపల్లి, లింగాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని తహశీల్దార్ సయ్యద్ నిజాముద్దీన్ సోమవారం పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక సవరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఫారాల పరిశీలనలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపారు.గ్రామ సర్పంచ్‌లు ముంజ మహేశ్వరి–మధుకర్ గౌడ్,కాసెట్టి వీరేశం, ఆర్‌ఐ జమున,వార్డు సభ్యులు, జీపీఓ అల్తాఫ్, అజీముద్దీన్,పంచాయతీ కార్యదర్శి నిఖిల్ రెడ్డి, తిరుపతి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ , బీఎల్ఓ,బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.